# శివకాంత

## శ్రీరాణం సుబ్రహ్మణ్య శర్మ

"ఎదిగిన యిద్దరు మగవారిమధ్య వున్న స్నేహం, ఇద్దరు ఆడవాళ్ళమధ్య వుంటే వుండదు. ఆడవాళ్ల స్నేహానికి పనికిరారు" అన్నాడు శివప్రసాదరావు.

ఆ ఉదయమే మా ఆవిడా వాళ్లావిడా పోట్లాడుకున్నారు. ప్రసాదరావు భార్యకి తను అందగత్తెననే గర్వం. వాళ్లాయన తనను ఎక్కడపడితే అక్కడికి వెంటపెట్టుకు వెళ్తాడనీ, నేను మా ఆవిడను ఎక్కడపడితే అక్కడకు తీసుకువెళ్ళకపోవడాని మాఆవిడ అంత చక్కనిది కాకపోవడమే కారణమనీ ఆవిడ వెక్కిరించిందట—యిలా నా స్నేహితుని భార్యమీద నాతోచెప్పి "తెల్లతోలు తప్ప ఒంట్లో ఎక్కడా ఎముకా కండాలేవు. అలాటి గర్విష్ఠివాళ్ళంటే నాకు ఒళ్లు మంట' అని మా ఆవిడ విసుక్కుంది.

"ఆ మొగుడు చచ్చీ చెడీ యింటికి రావడం తడవు-నెత్తినెక్కి సవారీచేస్తుంది. ఏ బజారుకో షాపింగ్‌కో స్నేహితులిళ్లకో సినిమాకో ఎక్కడికో అక్కడకు తీసుకెళ్తే కాని వదల్దు. అందుకే వాళ్లకి వూరినిండా అప్పులు—" అంటూ ప్రసాదరావు భార్య గురించి విమర్శించింది.

నాకు చాలా సిగ్గుగా వుంది. ప్రసాదరావూ నేనూ ప్రాణస్నేహితులం—కాలని పక్కపక్క యిళ్లల్లో వుంటున్నాం. ఈ విడ మాటలు అతనికి వినిపిస్తాయేమెనని నేను గిజగిజలాడిపోతున్నాను. ఎటూ చెప్పలేక—

"ఆవిడ నీకంటే చిన్నది. పైపాలుంటే మనం సర్దుకోవాలి. మాటల్లో బయటపడ గూడదు" అన్నాను.

"మీరు నన్నెక్కడికీ తీసుకెళ్ళరు. అందుకే నేనావిడకు లోకువ. అనుకుంటే సరా—ఏ మందంలెండి నా మొహం అందం-తెల్లగా పాలిపోయి వుంటుంది. వాళ్ళు నవయవ్వన విలాసవంతులు. మనవేమో ముసలి దంపతులం. అందుకే ఆవిడకంత మిడిసిపాటు" అని ఆ అందచందాల తగూలోకి నన్నుకూడా యిరికిస్తూ మాట్లాడింది మా ఆవిడ.

కాస్త ఆలోచించి, ప్రమాదకరమైన యీ అందచందాల వివాదంలోంచి మా ఆవిడ బుర్రను తిప్పాలనే ఉద్దేశంతో—

"అందమైనవాళ్లయితేమటుకు మొగుడూ పెళ్లాలు పోట్లాడుకోరా?" అన్నాను.

మా ఆవిడ నా ప్రశ్నకు సూటిగా జవాబు చెప్పకుండా—తను మరో మెలిక వేస్తూ—

"అయితే ఆవిడ అందమయిందని మీరూ ఒప్పుకుంటున్నారా?" అని 'యూ టూ బ్రూటస్'లా నాకేసి చూసింది.

"చూడు—స్నేహితుని భార్య అందం గురించి నన్ను ప్రశ్నించి చంపకు. ఆవిడ చాలా మంచిది" అన్నాను.

"ఏం మంచి? ఆవిడ మంచితనం మీకేం తెలుసు?'

"నీకూ తెలుసు. ఇప్పుడేదో కోపం మీదున్నావు. అందుకని కఠినంగా వున్నావు. నీ మనసులో పాపం ఆవిడంటే జాలిలేదా?"

"నాకా? పాపమంటూ జాలా? దేనికి?"

"నువ్వే చెప్పావుకదా—ప్రసాదరావుగారి కోసం ఎవరెవరో స్నేహితులు వేళాపాళా లేకుండా వస్తారని. వాళ్లకు స్నానపానాలు, తిళ్ళూ, టిఫిన్లూ, కాఫీలు చేసిపెట్టలేక ఆవిడ సతమతమయిపోతుందనీనూ."

"అమ్మ—ఏం చిత్రంగా మాట్లాడుతారండీ? వేళాపాళా లేకుండా వచ్చే అతిథులంటే ఏ ఇల్లాలికి విసుగ్గా వుండదూ?"

"ఆవిడ ఎల్లా చేసిపెడుతోందోనని నువ్వే ఆశ్చర్యపోయావుగా—అతను మొండివాడనీ—ఇల్లాలి కష్టసుఖాలు ఆలోచించడనీ—పైగా వాళ్ళంతా వాళ్ళ ఒకే ఒక మంచంమీద ఎక్కి కూర్చోడం, పడుకోడం, ఆవిడ కసహ్యమనీ-తువ్వాళ్ళూ దుప్పట్లూ లుంగీలు అన్నీ వాళ్ళు వాడేస్తూంటే ఆవిడ పళ్ళు పటపటా కొరుక్కుంటుందనీ నువ్వే చెప్పావుగా-మళ్ళీ యిప్పుడిలా మారిపోయావేం కాస్తంత పేచీ వచ్చి?"

"బావుందండోయ్—ఆడవాళ్ళ కష్టాలు మీకేం తెలుస్తాయ్. ఎంత స్నేహితులయినా మంచాలమీదెక్కి దొర్లితే ఏ ఇల్లాలికయినా ఒళ్ళు మండుకొస్తుంది. ఇది ఇల్లా-హోటలు రూమా అనిపించదా? వాళ్ళిద్దరిమధ్యా అందుకే అస్తమానూ పోట్లాటలు వచ్చేవి."

"అందమయిన వాళ్లుకూడా పోట్లాడుకుంటారని నువ్వు ఒప్పేసుకుంటున్నావన్న మాట!"

"పోట్లాట వెలిశాక ఆయన ఆవిడని షాపింగ్‌కో, సినిమాకో తీసికెళ్లేవాడు. తన గెస్టుల ముందు అల్లరిపెట్టకుండా సహించి చాకిరీ చేస్తున్నందుకు, ఆవిడ దుబారాఖర్చుల్నీ ఆ మగాడు చచ్చినట్లు కుక్కిన పేనులా భరిస్తున్నాడు. అది ఆవిడ చక్కంది కావడం వల్ల ఆయన్ను కొంగున కట్టుకు తిప్పుకుంటున్నాననుకుంటే అది పొరపాటు. పొరపాటే కాదు తెలివితక్కువకూడా."

"ప్రసాదరావు పెళ్లాంమీద నీ కిప్పుడు కోపం వుందా, పోయిందా? పోయిందంటే నీకోమాట చెప్తాను."

మా ఆవిడ మొహం ఎర్రబడింది. తమాయించుకుని—

"ఆవిడ గర్విష్ఠి అవునాకాదా? ముందా మాట చెప్పండి."

"ఆవిడ స్వయానా అతనికి అప్పకూతురు. చిన్నప్పట్నుంచీ మేనమామ నెత్తెక్కి

తొక్కేది. అదంతా పైవాళ్ళకు మరోలా కనపడొచ్చు. అతిగారం వలన ఆ పెడ చేష్టలన్నీ అప్రియాలైనా ప్రియాలైనా అతను భరించక తప్పదు.”

“ఇదేనా మీరు నాకు చెప్తానన్న రహస్యం?”

“కాదు. ప్రసాదవురావు ఉద్యోగం మానేస్తున్నాడు. మానేసి వాళ్ళపార్టీవర్క్‌కి అండర్ గ్రవుండ్‌కి వెళ్లిపోతున్నాడు.”

“మరి పెళ్లాం పిల్లలూ—”

“వాళ్లను వదిలేస్తున్నాడు.”

“మరి ఆవిడ యిష్టపడిందా?”

“ఆవిడ కసలు తెలీదు.”

“రామ రామ! మీ రెల్లా వూరుకున్నారండీ? పాపం ఆవిడ కాపరంలో నిప్పులు పోసి అతనల్లా చేస్తూంటా—”

“ఎవరు చెప్పినా వినడు.”

మా ఆవిడ కాసేపు నిర్ఘాంతపోయి ‘కర్కోటకుడు’ అని గొణుక్కుని ‘మరింకేమీ లాభం లేదా?’

“లేదు.”

ఇంతవరకూ దూషించిన ప్రసాదరావుభార్య కోస మావిడ మనస్ఫూర్తిగా బాధపడి కళ్ల నీళ్లు పెట్టుకుంది.

* * *


సన్నగా పొడుగ్గా పెట్టె మరకలుపడ్డ జరీచీరలా వుంటుంది శివకాంత. నాకు తెలిసిన ఆడవాళ్ళే చాలా తక్కువ. అందులో నా కిష్టమైన ప్రియస్నేహితుడి భార్య శివకాంత. ఆ అమ్మాయి అసలు పేరు శివకాంతకాదు. శివప్రసాదరావు నా కిష్టమైన స్నేహితుడు కాబట్టి అతని పెళ్లాన్ని ‘శివకాంత’ని నేనే రిఫర్ చేస్తూ వుంటాను.


మా ఆవిడ అంటే శివప్రసాదరావుకి గౌరవం—నేనంటే చిన్న గురి. ఈ ఆడతగ గురించి ప్రస్తావిస్తూ ‘గురూగారూ ఆడవాళ్ళు స్నేహితులుగా వుండలేరు’ అని వ్యాఖ్యానించాడు.

“మనం వాళ్ళని ఎదగనివ్వలేదు. చీరలు నగలూ బజార్లూ సినిమాలు అసూయలూ వాళ్లనల్లా చావనివ్వండి-” అని చేత్తో గాలిలో కొట్టిపారేశాడు.

శివకాంతని గురించికూడా సిద్ధాంతీకరిస్తూ -

“అదో పెద్ద మూర్ఖురాలు—ఎడ్యుకేటెడ్ అవలేదు. చెత్తనవలలు తప్ప అది మరింకేమీ చదవలేదు. ఎంతమంది పేదజనం ఎన్ని కష్టాలు పడుతున్నారో వీళ్లకి తెలుసా? జీవితాన్ని ఎదుర్కోవడం పేదస్త్రీలకు తెలిసినట్లు వీళ్లకేం తెలుసు? మగాళ్లకి ఎపెండేజ్‌గా






కాకుండా తమ కాళ్ళమీద తామ నిలబడేటట్లు ధైర్యంగా జీవితాన్ని ఫేస్ చేయడం వీళ్ళకి చస్తే రాదు. ప్రేమ ప్రేమని మిడిల్‌క్లాస్ వాల్యూస్‌ని పట్టుకుని ప్రాకులా తారు. పూర్ క్రీచర్స్'' అన్నాడు.

* * *

శివప్రసాదరావు ఉద్యోగాని కి రాజీనామా యిచ్చి హైదరాబాద్ వెళ్తున్నప్పుడు వాళ్ళని భోజనానికి పిలుద్దామా అని మా ఆవిడను అడిగాను.

''మీ ఫ్రెండ్‌కి ఎంతోమంది లంచ్‌లూ డిన్నర్లూ ఆఫర్ చేశార్ట. ఎవ్వటికని వెళ్ళ గలం అందిట ఆవిడ. మనం పిలిచినా ఆవిడ పడనివ్వదులెండి. మనకిది మళ్ళీ మరో అవ మానం'' అంది మా ఆవిడ.

శివప్రసాదరావుని శివకాంత కట్టిపడే స్తుంది, ఎక్కడికీ పోనివ్వదని మా ఆవిడకు యింకా అనుమానంగానేవుంది ఉద్యోగం మానేసిన రోజున వాళ్లిద్దరూ అరకురాజూ అరకురాణీల్లా ఆటోలో భోజనాలకీ విందులకీ సినిమాలకీ స్నేహితులిళ్లకీ తిరగడాన్ని మా ఆవిడ మరోలా అర్థంచేసుకుంది.

* * *

శివప్రసాదరావు యూజీలో వెళ్లిపోయా డని నమ్మకంగా విన్నాను. దొరికితే ఏం చేస్తారని బిక్క మొహం వేసుకుని మా ఆవిడ అడిగింది. కాల్చి చంపేస్తారన్నాను.

* * *

శివప్రసాదరావు ఏమయాడని అతని కొలీగ్స్, ఫ్రెండ్స్ నన్ను అడిగేవారు. మీకు తెలిసేవుంటుంది, మీకు తెలీకుండా ఉంటుందా అని అనేవారు. అతను ఉద్యోగం మానేముందు నాకు అప్పగించిన చిన్న చిన్న పనులు చేస్తూ వచ్చాను. కొంతమంది అతను యీ చుట్టుపక్కలే వర్క్ చేస్తున్నాడని అనేవారు. అతనిగురించి అంతా మిస్టరీగా చెప్పుకునేవారు.

మా ఆవిడ కూడా—'అలాటివాళ్లు పెళ్లి చేసుకోకూడదు. పెళ్లిచేసుకున్నాక వాళ్లను నట్టనడి సముద్రంలో ముంచకూడదు. మీ స్నేహితుడు చేసింది తప్పే'నని పెళ్లయిన వాళ్లకు దేశభక్తి వుండకూడదన్నట్లు మాట్లాడేది.

ఆవిడకు తను అందకత్తెననే గర్వం వున్నందుకు తగిన శాస్తి జరిగిందని మాత్రం మా ఆవిడ అనలేదు. అతని భార్య తమ్ముడి దగ్గరకు వెళ్లిపోయిందనీ, మెట్రిక్యులేషన్‌కు ప్రయివేటుగా కట్టి ప్యాసయి ఏదయినా జాబ్ చేసి పొట్టపోషించుకోవాలనే అభిప్రాయం వుందని విన్నాను. పిల్లల్ని చదివించు కుంటోంది.

* * *

శివకాంత మెట్రిక్యులేషన్‌కు కట్టి ప్యాస యింది. శివప్రసాదరావు స్నేహితులు సూపర్ బజార్‌లో సేల్స్‌గరల్‌గా జాబ్ సంపాదిస్తే, ఆమె తమ్ముడు 'మా అక్క ఉద్యోగంచేస్తే మాకు పరువు తక్కువ' అని పేచీపెట్టి ఆమె జాబ్‌లో చేరకుండా అడ్డుపడ్డాడని విన్నాను. శివకాంతను పిల్లలు మాత్రం 'నాన్న ఏడీ? ఎప్పుడు వస్తాడని' అడగడం ఆవిడ కలకత్తాలో వున్నారనీ, ఢిల్లీలో వున్నారనీ, రీసెర్చి చేస్తున్నారనీ చెప్పి తప్పించుకుంటూ వుండేది. పిల్లలకీ జ్వరాలు, పై ఖర్చులూ స్కూలు ఖర్చులూ వచ్చినపుడు కొద్దిగా అప్పులు చేసేది. సహాయం యెవరు చేస్తా మన్నా ఒప్పుకునేది కాదు. ఉండి వుండి 'మామయ్య యింత అన్యాయం చేస్తాడనుకో లేదు' అని గొల్లున శోకన్నాలు పెట్టేది. ఆవిడ్ని అలా ఏడ్వనిస్తే మళ్ళీ తనకు తానే సర్దుకునేది.

* * *

రెండేళ్ళు, మూడేళ్ళయింది.

'ఇంకా మీ ఫ్రెండ్ బయటకు రాలేదా' అని అంటూండేది మా ఆవిడ.


''ఆయన బావున్నాడా? ఆయనకేం ప్రమాదం జరగలేదు కదా'' అని అడిగేది.

శివకాంత పిల్లలకి జ్వరాలు, ఆమె కూడా సుస్తీపడి లేచిందని విని మా ఆవిడ కళ్ళ నీళ్లు పెట్టుకుంది.

* * *

ఒకరోజు ఒక దూతవచ్చి నాకో చీటీ యిచ్చి నన్ను ఫలానా చోటుకి ఫోన్ చేయ మన్నాడు. అవతల మనవాడి గొంతుని గుర్తు పట్టి అతను బతికే వున్నందుకు చాలా సంతోషించాను. సందులూ గొందులూ ఇరుకు గల్లీలు దాటి ఓ మారుమూల కొంపలో నేనతన్ని కలుసుకున్నాను. ఇద్దరం చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాము. టీ తాగాము. అతను భార్యాపిల్లల విషయం అడిగి తెలుసు కున్నాడు. ఒకమాటు వెళ్ళి చూడకూడదా అని సూచించాను. మా ఆవిడ రాగాలుపెట్టి గొడవ చేసిందంటే నన్ను మోసేస్తారు. దాని వల్ల నాకు, నావల్ల మావాళ్ళకీ డేంజర్... నేను దాన్ని కలుసుకోను అన్నాడతను నిర్లిప్తంగా.

చిక్కలేదు, నీటుగా ధీమాగా వున్నాడు. ఎప్పటిలానే అతని అభిప్రాయాలతనివి. వంగని శివధనుస్సులా వున్నాడు. స్నేహితు లందరి గురించీ అడిగాడు. ఫలానా పుస్తకాలు పత్రికలు కావాలన్నాడు. మా ఆవిడని మా పిల్లల్నీ అందరినీ మరీ మరీ అడిగాడు. బయ టకు రావడం యెప్పుడు అనే ప్రశ్నకు దేశ పరిస్థితులు మారినప్పుడు అనేది జవాబు. అతనిమీదేం కేసులు లేవుట. పార్టీ ఆర్గ నైజేషన్ వర్క్‌కాని యాక్షన్‌లో లేడుట. కాని, బయటకు వస్తే ఏవో కేసులు బనా యించి జైలుకి పంపిస్తారట. జైల్లో వెళితే లాభం కదా, చంపరు. కేసులమీద కేసులు




నడుస్తూ వుంటాయి, అంతేకదా అన్నాను. అతను నవ్వాడు. నాకేం భయంలేదు. మీరు గాబరా పడకండి అన్నాడు.

"ఒకసారి మీ ఆవిడను పిల్లలనూ చూసి ఓదార్చి వస్తే మంచిది కాదా?" అని మళ్ళీ అడిగాను.

"ఎవర్ని ఎందుకు ఓదార్చాలి? కోట్లాది భారత ప్రజానీకాన్ని ఎవరు ఓదార్చగలరు?"

"మీ గురించి ఎక్కడ వున్నదీ చెప్పమని పోలీసులు ఆవిడను యిబ్బంది పెడితే—"

"ఇబ్బందిపెట్టినవారి అందరి చరిత్రలూ ఎలా వుంటాయో దీని చరిత్రా అలాగే అవుతుంది? దేశభక్తుల పెళ్లాల్నీ, తల్లుల్నీ, చెల్లెళ్ళనీ అవమానించడం అది పోలీసువాళ్ల పవిత్ర కర్తవ్యం యీ ఎమర్జెన్సీలో—"

"మరి ఆవిడ యిలాటి అవమానాలకు తట్టుకోగలదా?"

"దేశభక్తుని భార్య కావడం అవమానం అయితే తట్టుకోలేరు."

చాలాసేపు రాజకీయాలు మాట్లాడుకున్నాం. దేశం ఒక అంధకార యుగంలో వుంది. ఇందులోంచి జాతి మొత్తం ఎలా బయటపడుతుందోనని ఆలోచించాం.

కోట్లాది భారతీయుల గురించి వారి కష్టాల గురించి నా మిత్రుడు ఆలోచిస్తున్నాడు. నేను నా మిత్రుడి భార్య, పిల్లలు వారి కుటుంబం పడే కష్టాల్ని గురించి మాత్రమే ఆలోచించ కలుగుతున్నాను.

* * *

శివప్రసాదరావును నా పక్కవాటాలోకి నేనే తెచ్చుకున్నాను. ఎక్కడికి వెళ్లినా మేమిద్దరం కలిసే వెళ్లేవాళ్లం. అతని వాదనాపటిమను, విశ్లేషణా శక్తిని నేను మెచ్చుకునేవాడిని. నా చొరవను, ధైర్యాన్నీ, సాహసాన్నీ అతను పొగిడేవాడు. యథాప్రకారం అతనూ అతని విజిటర్సూ, చిన్న చిన్న మీటింగ్సూ, తిరుగుళ్ళూ అతని రాజకీయాలూ మామూలు మనుషులకి అర్థమయేవి కావు. వీటిని మినహాయిస్తే అతను గొప్ప స్నేహశీలి, సారస్వతప్రియుడు, చక్కని ఉపాధ్యాయుడు, కార్యకర్త. అతనిలో అరాచకత్వం కాని, అశాస్త్రీయమైన ఉద్వేగంగాని వుండేది కాదు. ఎవరేపనిచెప్పినా మీద వేసుకునేవాడు. విసుగూ అలసటా లేని మనిషి.

ఓరోజు రాత్రి—నా తలుపుమీద ఎవరో ఏడుస్తూ బాదుతున్నారు. నిద్దట్లో లేచి తలుపు తెరవగానే శివకాంత నన్ను పట్టుకుని ఏడుస్తూ నా కాళ్లమీద వాలిపోయింది. ఆ ఏడుపులో నాకు తెలిసింది—నా మిత్రునికి రోడ్డుమీద ఆక్సిడెంటయిందట—ఆటోవాళ్లు తీసుకెళ్లి గవర్నమెంటు ఆస్పత్రిలో చేర్చారట.

ఆమెనుఓదార్చి ఆ రాత్రి ఆటోలో ఆమెను తీసుకుని ఆసుపత్రికి వెళ్లి శివప్రసాదరావుని చూశాను. అతనికి మైనర్ ఫ్రాక్చర్, మైనర్ ఇంజురీస్ తగిలాయి.

అప్పుడతను రిక్షా తిరగబడిందనీ, తన కేమీ ఫరవాలేదనీ, ఆ రిక్షావాలా సంగతి చూడవలసిందనీ, అతనికేమయినా సహాయం చేయవలసిందనీ కోరాడు.

అప్పుడతని భార్య—

—యిలా వేళాపాళా లేకుండా, స్నేహితులకోసం, వారికోసం, వీరికోసం, రైలు స్టేషన్లకీ, బస్స్టాండ్లకీ తిరగవద్దనీ, బయట పనులు తగ్గించుకోమని చెప్పమంది.

"నీతో సినిమాకెళ్లి వస్తూండగా పడిపోకూడదా రిక్షాలోంచి—" అని తనని వెటకారం చేసినందుకు ఆమె చిన్నబుచ్చుకుంది.

ఆ యాక్సిడెంట్ జరగడంవలన వారిద్దరూ చాలా క్లోజ్ అయారు.

"ఈవిడ పెంకితనం, నా మీద జులుం ఎక్కువయిపోయిందండీ" అని అతను శివకాంతను చూపించి నవ్వాడు. "ఆవిడ అలా పేరంటానికో పెళ్లికో వెళ్లినట్లు ముస్తాబు చేసుకుని ఆసుపత్రికి వెళ్తుందేమిటండీ" అని మా ఆవిడ కామెంట్ చేసేది.

"శుభ్రంగా నీటుగా వుండక ఏడుపు మొగంతో వుండమంటావా?" అన్నాను.

"అబ్బే - మీకు తెలియదు లెండి" అని మా ఆవిడ విసుక్కుంది. తన భర్తను అన్య మార్గాలనుంచి తనవేపుకు తిప్పుకోవాలని 'శివకాంత' తన ఆకర్షణను శ్రద్ధగా పెంచుకోవడం మా ఆవిడ గమనించింది కాని నేను గమనించలేకపోయాను.

"స్పెషల్ రూమూ స్పెషల్వార్డూనూ—ఈవిడెప్పుడూ అతడ్ని రాసుకుంటూ పూసుకుంటూ ఆ మంచంమీదే ఎక్కి కూర్చుంటుంది."

"అయితే—"

"ఎవరూ లేనప్పుడు ఆ మానవుణ్ని ఈవిడ యేమి యిబ్బందులు పెట్టేస్తూందో ఏవిటో" అని పైకి ఆకాశంవైపు చూపింది.

"అబ్బ — ఏమి బుర్రలర్రా మీవి—" అని నవ్వేశాను.

ఇల్లాలుకూడా శారీరక ఆకర్షణను ఆయుధంలా వాడాలా—అని కొంచెం ఆలోచించి నా బుర్ర పాడుచేసుకున్నాను. శివకాంతమీద నాకు జాలికలిగింది.

* * *

ఎమర్జన్సీ చివరిదశలో మరోసారి ఓ పాత హోటల్లో ఓ రూములో మళ్ళీ కలుసుకున్నాము. అతని ఆహ్వానంమీదే. సమూసాలు తిని చా త్రాగాము. కష్టసుఖాలు చెప్పుకున్నాము. కొంతసేపయాక టాపిక్ శివకాంత మీదకు మళ్లింది. అతనే అన్నాడు.

"మా వూరు వెళ్లానండోయ్" అని.

"మీ ఆవిడ్ని కలుసుకున్నారా? మాట్లా

డారా? ఏమయింది?'' అని ఎదుర్దాగా అడిగా.

మళ్లీ నవ్వాడు—''మా వాళ్లు వున్న వీధికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్నా. కాని కలుసుకోలేకపోయా.''


''అదేమిటి? అన్యాయం—''

''ముఖ్యమంత్రి వూళ్లో కొచ్చాడు—వూర్నిండా పోలీసులు మఫ్టీలో దిగిపోయారు. వీధిలోకి రావడానికి, కదలడానికి వీలులేక పోయింది. ఒకరిద్దరు ముఖ్యమైన మిత్రులకి కనిపించి వెనక్కి వచ్చేశాను.''

''మరి ఆవిడ—''

''ఆవిడకు నేనువచ్చి వెళ్లిపోయానని తెలిసి చాలా కోపంవచ్చి వుంటుంది. ఏం చేస్తాం?'' అని గాలిలోకి చేతులు విసురుతూ నవ్వాడు.

నాకు నోట మాటరాలేదు.




* * *

అతను కులాసాగానే వున్నాడనీ, కుటుంబ విషయాలన్నీ అతనికి తెలిపాననీ, ఆరోగ్యంగా మునపటంత ఉత్సాహంగా వున్నాడనీ నేను శివకాంతకు భోగట్టా అందేలా ఉభయులకీ సంబంధించిన మిత్రులకి తెలియపరిచేవాడిని.

శివకాంత ఎలావుంది? అడిగినప్పుడల్లా ఎవరూ నాకు సంతృప్తి కలిగేలా చెప్పలేక పోయారు. పరిస్థితులను అర్థం చేసుకుందా? ఏవిటి ఆవిడ ధోరణి—అని అడిగితే-ఆమె మరింత బిగుసుకుపోయిందని అన్నారు. ఎవరెంత చిన్న సహాయం చేయబోయినా అవమానంగా ఫీలయి నిరాకరిస్తుంది. భర్త యుజిలోవున్న స్త్రీకి ప్రయివేటు సంస్థలలో పిలిచి ఎవరు ఉద్యోగం ఇస్తారు? అగ్రవర్ణస్థులమనే అభిజాత్యంకూడ ఆమెను ఓమెట్టు క్రిందకు దిగి ఆలోచించనివ్వలేదు.

బయటకు వెళ్లడం మానుకుంది. పేరంటాలు, పుట్టిన రోజులు, పెళ్లిళ్లు, వేడుకల సమయాల్లో భర్తను గురించిన ప్రసక్తివస్తుందనే భయంతో కాలు బయటపెట్టలేదు. ఎంతో ఇష్టపడి వెళ్లే సినిమాలు బోరుకొట్టాయి. అన్నిటికంటె ముఖ్యమైనది కుటుంబబాధ్యతను స్వీకరించి సంసారాన్ని నడపడం—జాయింట్ ఫామిలీ కాబట్టి సరిపోయింది. ఉమ్మడి ఆస్తుల మీద గీకుతున్నారు.

భార్యాభర్తల్ని, తల్లీకొడుకుల్ని, తండ్రీ బిడ్డల్ని విడదీసే రాజకీయాలంటే ఆమెకు గల వైముఖ్యం మరింత పెరిగిందేకాని తగ్గలేదు. భర్త స్నేహితవర్గంలో ఒకరో యిద్దరో తప్ప మిగతా అంతా తమ కుటుంబానికి ద్రోహం చేసినవారిలా కనిపించారు.

ఎవరి పిల్లలతోవారు కాపరం చేసుకుంటున్నారు. ఎవరి ఉద్యోగాలు వారు చేసుకుని కుటుంబాలు చూసుకుంటున్నారు. తనకే ఎందుకు యిలా జరగాలి? ఎందుకు ఆయన్ను నిలబెట్టుకోలేక పోయాను—నాకే, నా పిల్లలకే ఈ అన్యాయం జరగాలా—అని కుమిలి పోయేది. చివరకు అతనిపట్ల గల వ్యతిరేక భావన తప్ప, అతను అనుసరించిన పంథా పట్ల విముఖత్వంతప్ప—ఆమెలో దేశభక్తి పెరగలేదు.

ఇది యిలా వుండగా స్కూలు కెళ్ళిన పిల్లలిద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చి—

''అమ్మా అమ్మా మనం ఎవరం?'' అని అడిగారుట.

''నువ్వేం చెప్పావు?'' అని చిన్నవాడిని అడిగిందట.

వాడు 'మేం బ్రాహ్మలం' అన్నాడుట. పెద్దాడు అది తప్పని తమ్ముడ్ని ఖండించాడుట.

''మరి నువ్వేం చెప్పావురా?'' అని శివకాంత పెద్దవాడి నడిగింది.

''మేం కమ్యూనిస్టులం అని చెప్పా నమ్మా'' అన్నాడు వాడు. శివకాంత తెల తెలబోయింది. ఏడిచి తల మొత్తుకుందిట.

ఈ వివరాలన్నీ నాకు చెబుతూ, ప్రసాదరావు శ్రేయోభిలాషి—'కాలమే ఆవిడ మనస్థితిని చక్కదిద్దాలి. అంతే' అన్నారు.

''అతను వస్తాడు. మళ్లీ సంసారం చక్కబడుతుందని ఆమె ఆశిస్తోందా?''

''పిల్లలేవో అడిగినప్పుడు ఆశగానే చెపుతుంది. కాని తన స్టేటస్‌ని అతను డేమేజి చేసినందుకు ఆవిడ చాలా బాధపడుతోంది.''

''ఏవిటా స్టేటస్?''

''భర్త వదిలేసిన స్త్రీగా మిగిలిపోవడం అన్యాయం కాదా?''

''అతనీవిడ్ని కూడా లోపలికి లాక్కోవచ్చనుకుంటానే—''

''ఈవిడ రహస్య జీవితానికి పనికిరాదు.''

''మరి ఉప్పూ పులుసూ తినే మనిషికదా. కోరిక కలగకుండా వుంటుందా?''


''ఏంచేస్తుంది? ఏడుస్తుంది-పాపం.''

''మనవాడ్ని యిందులోంచి బయటకు లాగే మార్గం ఏదన్నా ఆలోచించాలి.''

* * *

''మీవాడిమీద ఛార్జెస్ ఏమీలేవు. వచ్చి మాకు లొంగిపోమనండి'' అన్నారు పోలీసులు. ఆ ముక్క అతను వినలేదు. మళ్ళీ ఓసారి ఓ వర్కర్ ఇంట్లో కలిశాడు. ఎమర్జెన్సీ గురించి మాట్లాడుకున్నాం. పరిపాలించే వారి నిజస్వరూపం ప్రజలకు బాగా తెలిసిపోయింది. మా పని తేలికయింది. పరిపాలకులే రివల్యూషన్ అవశ్యకతను అది రావటానికి గల ఛాన్సెస్‌ను స్పీడ్ అప్ చేస్తున్నారు. ఎవరు వచ్చినా వీరు పేద ప్రజలకు ఏమీ చేయలేరు. ఎమర్జెన్సీవలన బ్రహ్మాండమైన అవేకెనింగ్ ప్రజలలో వస్తున్నదని అన్నాడు.

ఆ వర్కర్ భార్య మమ్మల్ని పలక




రించింది. మాకు టీ యిచ్చింది. ఆవిడతో మనవాడు వాళ్ళ పిల్లవాడి చురుకుదనం, అల్లరిగురించి మాట్లాడాడు. ఆవిడ తనకు కూడా ఉద్యోగం చేయాలని వుందని అన్నది. చూస్తా, అతనికి కూడా చెప్పి ఒప్పిస్తానని మనవాడు అన్నాడు. ఆవిడ పనికి వెళ్ళేటప్పుడు, పిల్లల్ని ఓకంట కనిపెట్టడం వారి చదువుగురించి కనుక్కోవడం చేస్తున్నా నన్నాడు. మొదట్నుంచీ నేను గమనించాను. చాలామంది పరాయి స్త్రీలు మనవాడితో చాలా చనువుగా వుంటారు. మంచీ చెడూ అతనితో చెప్పుకుంటారు. ప్రసాదరావుని ఓ కుతూహలకరమైన ప్రశ్న అడిగాను—

"అందరూ నీలాటివారు లేరనుకో—ఈ వర్కర్స్ యిళ్ళలో యూజిలో వున్నవారికి ఆ యింటి స్త్రీలతో తప్పక చనువు ఏర్పడుతుంది. వీరంతా స్త్రీ సంబంధంలేక అలమటించి పోతూవుంటారు. ఇలాటి పరిస్థితుల్లో నిగ్రహించుకోలేని సందర్భాల్లో ఆతిథ్యం యిచ్చిన ఆసామీకే ఎసరుపెట్టినట్లవుతుంది కదా—" అన్నాను.

"అప్పుడప్పుడు అలాటివి జరిగినపుడు పెద్దలు సరిచేస్తారు."

"ఏమిటి సరిచేస్తారు?"

"ఇలాటివి అవతలి పెద్దలక్ష్యం- కోట్లాది ప్రజల విముక్తి-కోసం ఇగ్నోర్ చేయవలసి వస్తుంది."

"మరి సెక్సు బాధలు తట్టుకోడం కోసం మీరంతా ఏంచేస్తారు?"

"ఇళ్లకు వెళ్ళి రహస్యంగా కలిసి వస్తారు. లేదా తమ తమ భార్యలను ఎక్కడికయినా రప్పించుకుంటారు దూతలద్వారా-"

"మరి వ్యభిచార గృహాలకు వెళ్లరా?"

"వెళ్లరు. వెళ్లకూడదు. బ్రోతల్స్‌లోని స్త్రీలను కూడా పీడితప్రజానీకంలోకి చేర్చి, వాళ్ళను మళ్లీ సెక్స్ దోపిడీకి గురిచేయడం తప్పు. రెండోది, వాళ్లకు అలవాటుపడితే ఎప్పటికో ఒకప్పుడు శత్రువుకి తేలికగా దొరికిపోతారు."

"ఇప్పుడు యిలా యూజి జీవితం గడుపుతున్న స్త్రీలకు కూడా కోరికలుంటాయి కదా? వారు ఒత్తిడికి తట్టుకోలేక కాలు జారచ్చు. అవునా కాదా?"

"ఇవన్నీ చచ్చుప్రశ్నలండీ-ఆ విధంగా బలవత్తరమైన వాంఛలకు లోబడిన స్త్రీలు అందుకై ఏమైనాచేస్తే అది తప్పు కాదండీ. సెక్స్ నేరాల్ని తేలిగ్గా క్షమించేస్తాం. దేశభక్తుడి స్త్రీని వ్యభిచారంలోకి దింపితే అది ఆ పరిస్థితుల్ని కల్పించిన సమాజానిది తప్పవుతుంది. ఆ తప్పు స్త్రీది కాదు."

"మరి మీరు శివకాంతతో కొన్నాళ్లు గడిపి ఆమెకు సంతోషం కలిగించడం అవసరం అని నేను అంటాను" అన్నాను వాదనకు.

"నేనలా అనుకోవడంలేదు. ఆమె అందుకు పనికిరాదు-" అన్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

నాకు కాస్త చిరాకు వేసింది. అతని పిడివాదనకు—

"ఆమె ఎందుకు పనికిరాదు?"

"సమావేశాలకు, సమాగమానికి ఆవిడ పనికిరాదు. ఆమె తత్వం నాకంటే మీకు ఎక్కువ ఎలా తెలుస్తుంది?"

"ప్రయత్నించి ఆవిడకో అవకాశం యివ్వరాదా?"

"నేను ఫ్రీగా మూవ్ అయే పరిస్థితులు వచ్చినప్పుడు అలా చేస్తే చేయవచ్చు."

"కాదు ఆమెను సంతోషపెట్టాలి. అది కనీస బాధ్యత, మానవత అనిపించుకుంటుంది."

అతను మళ్లీ పకపక నవ్వాడు.

* * *

అనుకోకుండా-పార్లమెంటు యెన్నికలు జరిగాయి. పాతప్రభుత్వం, దాని పార్టీని మూకుమ్మడిగా ప్రజలు తిరస్కరించారు. ఎమర్జెన్సీ ఎత్తివేశారు. జైళ్లలోంచి ముందు స్మగ్లర్స్‌నీ, ఆలోచించి కొంతమంది దేశభక్తుల్నీ, మిగతా వాళ్లనీ విడుదలచేశారు. బూర్జువా లిబరల్స్, మితవాదులు అధికారంలోకి వచ్చారు. ఒక కుటుంబానికి దేశ రాజకీయాల మీద కల గుత్తాధిపత్యం ముగిసింది.

"ఏమండీ మన ప్రసాదరావు బయట కొచ్చేశాడా? వాళ్ల ఫామిలీ గురించి ఏమయింది?" అని మా ఆవిడ కుతూహలంగా అడిగింది.

"మన రాష్ట్రంలో యింకా ఎమర్జెన్సీనాటి పార్టీయే అధికారంలో వుంది. ఇప్పుడు బయటకు వచ్చినా మళ్లీ లోపలికి తోసి మూసేస్తారు. రాకూడదు. ఇంకా వేచి చూడాలి" అని చెప్పాను.

* * *

శివకాంతనీ, అతడినీ తరచూ కలిపితే, అతను యీ మారిన పరిస్థితుల్లో—నెమ్మదిగా అటునుంచి యిటు వచ్చి కుటుంబం వైపు మొగ్గి పూర్వజీవితం కొనసాగించ వచ్చని మాకు మనసులో మారుమూల ఒక ఆశాకిరణం అవలేశంగా మెదులుతోంది. మా స్నేహితులంతా కొంత గ్రవుండ్ ప్రిపేర్ చేశారు. ఏదో ముహూర్తంలో అతను వచ్చేస్తాడు. ఓపిక పట్టమని శివకాంతకు 'హింట్' యిచ్చారు.

* * *

ప్రసాదరావు వెళ్లాడా? శివకాంత ఏమంది? వారు కలుసుకున్నారా? ఈ ప్రశ్నలు మమ్మల్ని సస్పెన్స్‌లో ముంచి చంపుతున్నాయి. ఇంతలో దివిసీమలో ఉప్పెన వచ్చింది. కోస్తా ఆంధ్ర శోకసముద్రంలో మునిగిపోయింది. అలాటి రోజుల్లో ఓ రోజున ప్రసాదరావు ఏమీ జరగనట్లే ఎప్పట్లానే నవ్వుకుంటూ మా యింటికి వచ్చాడు. మా ఆవిడ పెసరట్లకు నానవేసిన పెసరపప్పు రుబ్బుతోంది. అతన్ని చూడ్డానికి పెసరపప్పు రుబ్బుతున్న చేత్తో వచ్చి 'తప్పిపోయిన తమ్ముడ్ని' చూసినట్లు చూసి—పెసరట్లు చేసిపెట్టి తినిపించింది సాదరంగా.

"అక్కడంతా యెలా వున్నారు?" అని అడిగింది.

"నేనింకా అక్కడకు వెళ్లలేదమ్మా. ముందిక్కడికేవచ్చా"నన్నాడు.

"మూర్ఖుడు" అనుకుంది మా ఆవిడ.

*　　　*　　　*

ఓరోజు ఫలానా సెంటరుకి రావలిసిందని ఫోన్ వచ్చింది. అక్కడతను నాకోసం కిళ్లీ కొట్టుదగ్గర నిలబడి ఎదురుచూస్తున్నాడు.

"ఈ ఊళ్లో చెత్త సినిమా ఎక్కడ ఆడుతోంది?" అన్నాడు. చెప్పా.

"ఆ సినిమా హాల్లో కూర్చుందాం పదండి" అన్నాడు.

టిక్కెట్లు కొనుక్కుని ఆఖరి క్లాసుకి ముందు క్లాసులో కెళ్ళి కూర్చున్నాం.

"ఇంటికెళ్ళి వచ్చా" నన్నాడు.

పొంగిపోయి చీకట్లో షేక్‌హాండిచ్చాను.

—వివరాలింకా యిలా చెప్పాడు.

వెళ్లిన తరవాత ముఖ్య స్నేహితుల ద్వారా రాయబారాలు జరిగాయట. అతను ఓ హోటల్లో రూములో వున్నాడు. ఆమె అక్కడకు వెళ్లి ఆయన్ను కలుసుకుని ఆ రాత్రి ఆయనతో వుండవచ్చుట. వాళ్లకు ఏవిధమైన డిస్టర్‌బెన్స్ కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు జరిగిందిట.

ఆవిడకు ఎంత చెప్పినా ససేమిరా నేను లాడ్జింగ్ రూముకి రాను. మొగుడి దగ్గరకి ముండలా వెళ్లలేను - వస్తే ఆయనింటికి ఆయన్ని రమ్మనండి-అంతేనందిట.

"నేను చెప్పాను కదా-" అని ఫ్రండ్స్ మీద విసుక్కున్నాడు ప్రసాదరావు. ఇతను విరగని శివధనుసు, ఆమె శోకించని సీత. వీళ్లను కలపడానికి వాల్మీకి కూడా పనికి రాడు.

ఆ మర్నాడు ప్రసాదరావే తెల తెలవారుతూండగా ఉషోదయం మేలుకొలుపులా వెళ్లి తలుపు తట్టాడట. శివకాంతే వచ్చి తలుపు తీసిందట. ఆమె భుజంమీద చేయివేసి లోపలికి నడిచి తనకు అలవాటయిన గదిలో ఆమె మంచంమీద చుట్టంలా వచ్చి కూర్చున్నాడట. ఆమె కాఫీ కాచి పట్టుకు వచ్చిందిట. నిద్రపోతున్న పిల్లల్ని లేపాడట.

ఇంతలో తల్లికూడా వచ్చి కావిలించుకుని ఏడ్చిందట. ఏడిస్తే యిప్పుడే వెళ్లిపోవాల్సి వస్తుందమ్మా అన్నాడ్ట. ఏమీ జరగనట్లే—యీమధ్యన యీ వియోగమంతా మిథ్య అన్నట్లు గడిపారట. తల్లి కొడుక్కి యిష్టమని పప్పుచారు చేసి దగ్గర కూర్చుని తినిపించిందట.

శివకాంతని, పిల్లలని తీసుకుని రిక్షాలో ఓ మేట్నీ సినిమాకుకూడా వెళ్లొచ్చారట. అస్సలేమీ జరగనట్లే నిన్నటినుండి యీవాళ ఉదయించినట్లు —'స్మాల్ నతింగ్స్' చెప్పుకున్నారట.

—సినిమాహాలు నుంచి వచ్చేసరికి, వాళ్లమ్మ స్వయంగా కొడుకూ కోడలికోసం వణికే ముసలి చేతులతో పడకటిగదిని సర్ది అలంకరించి, పటాల బూజుల్ని తుడిచి, కొత్త దుప్పట్లు వేసి—అగరొత్తులు వెలిగించి పెట్టిందిట. ఓ పళ్లెంలో మల్లెపూలు కుప్పపోసి వున్నాయి.

ప్రసాదరావు యిలా యింట్లోకి అడుగు పెట్టాడో లేదో అతనికోసం ఆటో వచ్చింది. అతను వెనక్కు తిరిగి చరచరా తను నమ్మిన ప్రపంచంలోకి వెళ్లిపోతున్నాడు.

శివకాంత గుమ్మం పొదిగిటన నిలబడి మాయమవుతున్న భర్తకేసి చూస్తోంది.

తల్లి కోడలి తరపున నోరు చేసుకుని అడిగింది.

"నాయనా ఈ రాత్రికి వుండిపోరాదురా?" అని.

అతను ఆటోలో యెక్కబోతూ వెనుదిరిగాడు.

"మీరిద్దరూ" అని రెండువేళ్లతో వారిద్దర్నీ గుచ్చి చూపుతూ "కోట్లాది పేద ప్రజానీకానికి తల్లులు—" అని అగరొత్తుల పొగ వస్తున్న పడకగదికేసి చూపించి "మీరిట్లాటి పని చేయకూడదు" అని ఆటో ఎక్కేశాడట!

*


*Give Your Home*
*A New Look*
*A New Feel*

WITH **U-FOAM**

The Original Polyurethane Foam

*Distributors for:* U Foam
Pillows, Mattresses, Cushions etc.,

**VIKRAMS**

Marketing Enterprises
**Eluru Road**
(Near Ramamandiram)
**VIJAYAWADA.**